# ★ కాలధర్మం ★

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

వుడుకూడా కాలాన్ని కనిపెట్టి ఉన్నాడు కాలధర్మం గుర్తించలేని మానవుడు పైకిరాలేడు, కాలనిర్ణయానికి విరుద్ధంగా వెళ్ళటానికిప్రయత్నించే మానవుడు అవమానం పాలవుతాడు.

కాలధర్మమంటే ఇంగ్లీషులో హిస్టారిక్ డిటర్మినిజమ్, అనీ, కాలనిర్ణయమంటే హిస్టారిక్ నెసెసిటీ అనీ అనుకోవచ్చు

మానవుడిమీద కాలానికి ప్రభావం ఉన్నట్టే మానవుడికి కూడా కాలంమీద కొంత ప్రభావం ఉంది. కాలధర్మాన్ని గుర్తించి మానవుడు ఆ ధర్మాన్ని మార్చేస్తాడు — కాలధర్మాన్ని తృణీకరించికాదు, తనకు అనుకూలంగా వినియోగ పరచుకుని.

కాలధర్మాన్ని వినియోగపరచుకోవటమంటే ఒక మహత్తరమైన దైవికశక్తిని - ఏ పేలుడు మందూ, అణుశక్తీ పోటీచెయ్యలేని అద్భుత శక్తిని - ఉపయోగపరచటమన్నమాట ఇది మన పక్షాన ఉన్నప్పుడు గోటితో కొండనెత్తవచ్చు, పదిమందిమి కలిసి పదివేలమందిని నిగ్రహించవచ్చు, అణువుబాంబులను పేలకుండా చేయవచ్చు, సత్యాగ్రహంతో స్వరాజ్యం సాధించవచ్చు

ఇంత మహత్తరశక్తిని కావాలన్నప్పుడే వినియోగించుకోవచ్చుననటానికి లేదు. దాన్ని వినియోగిస్తే ఎంతలాభం ఉందో, వినియోగించకపోతే దాని కన్నిరెట్లు అపాయం కూడా ఉంది, ఈ సంగతి స్పష్టంగా గ్రహించినవాడెవడూ కాలధర్మం గుర్తించటానికి ఉపేక్ష చేయడు.

అయితే జీవితంలో నిత్యమూ కనిపించే సంఘర్షణా, బాధా, నష్టమూ చూస్తే కాలధర్మం తెలిసినవారు ప్రపంచంలో ఎంతమంది ఉన్నారని సందేహం కలుగుతుంది. జీవితంలో సంఘర్షణ ఉండరాదనికాదు, కాలధర్మంలో మార్పు కలిగినప్పుడల్లా సంఘర్షణ ఉంటూనే ఉంటుంది, కాని కాలనిర్ణయానికి అనుకూలంగా కొందరు ప్రతికూలంగా కొందరూ సంఘర్షణ పడ్డప్పుడా సంఘర్షణ త్వరలో తేలిపోతుంది, ఎక్కువ బాధా, నష్టమూ కలగదు

కాలనిర్ణయానికి విరుద్ధంగా పోరాడేవారు ఎప్పుడూ ఉంటారు, వారికి ధర్మం తెలియదనటానికి వీల్లేదు. కాని ఆ కాలధర్మం వారి స్వార్థాన్ని అపహరించే పరిస్థితిలో, వారు పోరాడి తీరుతారు, పెట్టుబడిదారీ నాగరికతను నిరోధించేటప్పుడు జమీందారీ వర్గంవారు ప్రజాస్వామ్యాన్ని నిగ్రహించేటప్పుడు పెట్టుబడిదారులూ పోరాడి తీరుతారు.

ఈ విధంగా కాలనిర్ణయాన్ని ఎదిరించి పోరేవారిని కాలధర్మం తెలుసుకొని మనం సులభంగా గుర్తించవచ్చు ఎందుకంటే వారు తమ విజయంకోసం కాలధర్మాన్ని ఆశ్రయించుకున్న వినాదాలుకొన్ని తప్పనిసరిగా వాడుతారు - అయితే వాటిని అక్రమంగా వాడతారు సక్రమంగా వాడితే అవి వారికి ఉపకరించవు, సామ్రాజ్యవాదులు చిన్నరాజ్యాల హక్కుల్ని గురించి బల్లగుద్ది వాదించేటప్పుడూ. పెట్టుబడిదారీవర్గంవాళ్ళు ఆర్థికప్రణాళికలను గురించి చర్చించినప్పుడూ. రష్యా విరుద్ధ ప్రచారం సాగించటానికి మార్క్సు ఛాయాచిత్రాన్ని వినియోగపరచినప్పుడూ. విద్రోహులుకూడా కాలధర్మం గుర్తించగలరని మనం తెలుసుకుంటాం. కాలనిర్ణయం తమకు అనుకూలంగా ఉందని ప్రజలను మభ్యపెట్టటమే విద్రోహులకు కావలసింది.

ఇటువంటి ప్రయత్నాలు సఫలమవుతాయా? దురదృష్టవశాత్తూ అవుతాయి. ప్రపంచంలో అధికసంఖ్యాకులకు కాలజ్ఞానం లేనంతవరకూ కాలనిర్ణయానికి విరుద్ధంగా పోరాడేమూఢులూ, సరిఅయిన నిర్ణయానికి రాలేని కర్తవ్యతా విమూఢులూ అభివృద్ధి నిరోధకులూ ఉంటూనే ఉంటారు ప్రపంచంలో బాధా, నష్టమూ పెంపొందించేది ఈ తరగతి వారే. ఉదాహరణలు చాలా దొరుకుతాయి హిట్లరు మీద సకాలంలో యుద్ధం ప్రకటించలేకపోయిన బ్రిటిషు టోరీ ప్రభుత్వమూ, అమెరికాను ధిక్కరించటానికీనాడు తటపటాయిస్తున్న లేబరు ప్రభుత్వమూ దీనికి నిదర్శనాలు

సచిత్ర కావశ్యకత అనబడే కాలనిర్ణ [illegible] దెప్పుడూ సందిగ్ధస్థితే. సందిగ్ధావస్థ ప్రభుత్వాలకేకలుగుతున్నప్పుడు ప్రజాసామాన్యానికి కలగటంలో ఆశ్చర్యం లేదు కాని జనసామాన్యానికి కాలతత్వం బోధపడటం చాలా కష్టం. దానికి తోడువారిని మభ్యపెట్టడానికి అనేక ప్రయత్నాలు జరుగుతాయి. అటువంటి పరిస్థితులలో కాలనిర్ణయం ప్రజలకు అర్థం కావటం ఎట్లా?

సాంఘిక జీవిత తత్వమూ, ప్రపంచ జ్ఞానమూ కాల నిర్ణయాన్ని గుర్తించటానికి రెండు పెద్ద సాధనాలు ఇవికూడా కష్టపడితే గాని లభ్యమయేవికావు. ఈ రెంటికన్నా సూక్ష్మోపాయం ఒకటి ఉన్నది అదేమంటే జీవిత సంఘర్షణనుచూసి కాలనిర్ణయం తెలుసుకోవడం

జీవితంలో జరిగే సంఘర్షణను నిష్పాక్షికంగా చూస్తే అందులో కొన్ని విడ్డూరాలు కనిపిస్తాయి పిచ్చుకలమీద బ్రహ్మాస్త్రాలు వేయటమూ, సమస్యలకున్న పరిష్కారమార్గాలు హేయంగా పరిణమించటమూ, మొదలైన వాటిని బట్టి మనం కాల నిర్ణయం గుర్తించవచ్చు అమెరికాలోనూ- దక్షిణ ఆఫ్రికాలోనూ ప్రభుత్వాలు అధఃపతితులై ఉన్న నీగ్రోలమీదా, దేశీయులమీదా దారుణ హత్యాకాండలు జరపటం ఎందుకు జరుగుతుంది? నిరాయుధులైన పాకీవాళ్ళమీదా కార్మికులమీదా పోలీసులు అత్యాచారాల నెందుకు చేయవలసి వస్తుంది? హైద్రాబాదులో ఉన్న రాజకీయ శక్తులన్నీ రైతులమీద ఎందుకు కేందీకరించవలసి వస్తుంది? కమ్యూనిస్టులు తీసుకురాబోయే అరాచక పరిస్థితుల్ని ప్రతిఘటించటానికి ప్రజారక్షణ చట్టంలాంటి తుచ్ఛశాసనం ఎందుకు చెయ్యవలసి వస్తుంది? అన్నిటికీ ఒకటే సమాధానం: పాలకవర్గానికి కాల నిర్ణయం ప్రతికూలంగా ఉండిగనక!

పిచ్చుక పక్షాన కాల నిర్ణయం ఉన్నప్పుడు బ్రహ్మాస్త్రమే వెయ్యవలసి వస్తుంది కాని మొదటనే చెప్పినట్టు మానవుడికి కాలనిర్ణయం గుర్తించే శక్తివుంటే బ్రహ్మాస్త్రంకూడాపారదు. మానవుడికి కాలజ్ఞానంలేకపోతే పదిమంది లాభాలకోసం లక్షమందిపోరాడటం జరుగుతుంది.